క్లుప్తంగా

యాజమాన్యాల గుర్తింపు రద్దు సరికాదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో 10వ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహించే అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) ఏలూరు జిల్లా కార్యదర్శి ఎన్ఆర్‌కేపీ ప్రసాద్ ఒక ప్రకటనలో విద్యాశాఖాధికారులను కోరారు. వచ్చే నెలలో పబ్లిక్ పరీక్షలకు సిద్ధమౌతున్న పదో తరగతి విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ ఉపాధ్యాయ సంఘాలకు కొమ్ము కాసే విధంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతోపాటు పరీక్షలకు సిద్ధం చేస్తున్న యాజమాన్యాల గుర్తింపు రద్దు చేస్తామని ఉత్తర్వులు ఇవ్వడాన్ని అపుస్మా ఖండిస్తోందని తెలిపారు. సెలవు ప్రకటించడం తమకు అభ్యంతరం కాదని, పదో తరగతి విద్యార్థులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డిగ్రీ, ఇంటర్ విద్యార్థులకు లేని సెలవు పాఠశాలలకే ఎందుకు ఇవ్వాల్సి వస్తోందని పేర్కొన్నారు.

నిలిచిన సత్యసాయి తాగునీరు

కొయ్యలగూడెం: సత్యసాయి తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు దాహార్తి తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కన్నాపురం అడ్డ రోడ్డు నుంచి గోదావరి జలాలు గోపాలపురం మండలం హుకుంపేట పంపింగ్ హౌస్‌కు సరఫరా అవుతుంది. అక్కడి నుంచి స్టెప్ ఛానల్ ఒకటి, రెండు పైపులైన్ ద్వారా పలు మండలాలకు సత్యసాయి సాగునీటి సరఫరా కొనసాగుతుంది. అయితే ఇందులో స్టెప్ ఛానల్ ఒకటి నుంచి వెళ్లే పోలవరం మండలం పేట సమీపంలోని పైపులైన్ మరమ్మతులకు గురి కావడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీని వల్ల పోలవరం, చింతలపూడి, నియోజకవర్గాలలోని మండలాలలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో పంచాయతీలు ఏర్పాటు చేసిన ట్యాంకర్ల ద్వారా ప్రజలు నీటిని తీసుకెళుతున్నారు. సుమారు వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మరమ్మతులు పూర్తవడానికి మరో నాలుగు రోజులు పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

మార్మోగిన శివనామ స్మరణ

- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం
- భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఏలూరు నగరం శివ నామ స్మరణతో మార్మోగింది. శైవ క్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. స్వామి వార్లకు విశేష అలంకరణలు చేశారు. రాత్రి ఆయా శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వార్లను దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జామున నుంచి ప్రత్యేక అభిషేకాలు, తైలాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం భజన, శివజ్యోతి కార్యక్రమాల అనంతరం స్వామి వారి శాంతి కల్యాణ మహోత్సవం జరిగింది. రాత్రి లింగోద్భవ కాలంలో స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

- అగ్రహారంలో గంగా, వింధ్యవాసినీ సమేత నగరేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము నుంచి అభిషేకాలు, స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, రాత్రి స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించి, రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు.


ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉదయం మహారుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి లింగోద్భవ కాలంలో స్వామి వారికి 516 కేజీల పంచదారతో మహా శర్కరాభిషేకం చేశారు. 27 హారతులతో స్వామి వారికి విశేష హారతి సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.
- దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామి వారికి అహోరాత్ర మహాశివరాత్రి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పూజలు, రుద్రాభిషేకాలు, పూర్ణాహుతి నిర్వహించారు. పార్వతీ కల్యాణం, లక్ష బిల్వార్చన, రాత్రి లింగోద్భవ కాలంలో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నాలుగు గంటల వరకు భజన, దివ్యనామ సంకీర్తన, జాగరణ చేశారు.


ఏలూరు (ఆర్ఆర్‌పేట) : చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- వైఎంహెచ్ఏ హాలులో కాశీ క్షేత్రం నుంచి తీసుకొచ్చిన స్పటిక లింగానికి హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కుంభ మేళా నుంచి తీసుకొచ్చిన జలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం పంచామృత అభిషేకం, అర్చన, పూజలు చేశారు. కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.
- నగరంలోని 50వ డివిజన్‌లోని శివాలయం, 3వ డివిజన్‌లోని రేవు లింగేశ్వర స్వామి, పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, అగ్రహారంలోని అన్నపూర్ణ సమేత ప్రతాప విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో ఎమ్మెల్యే బడేటి చంటి పూజలు చేశారు. స్థానిక దక్షిణపు వీధి జలాపహరేశ్వర స్వామి, మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి, అగ్రహారం అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, ఆదివారపు పేట పర్వతవర్ధని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానాల్లో అర్చకులు విశేష అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

పులిహోర, మజ్జిగ పంపిణీ

ఏలూరు (టూటౌన్): స్వచ్ఛభారత్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పంపుల చెరువు గట్టు ఏలూరు ఆధ్వర్యంలో బలివే వచ్చే భక్తులకు పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ విధంగా పదేళ్లుగా భక్తులకు పంపణీ చేస్తున్నట్టు గౌరవ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు తెలిపారు.


బలివే తిరునాళ్లలో అన్నదానం


ఏలూరు (టూటౌన్): బలివేలో భక్తులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న స్వచ్ఛ భారత్ వాకర్స్


ఏలూరు (ఆర్ఆర్‌పేట) : దత్తక్షేత్రంలో అభిషేకం చేస్తున్న భక్తులు


ఏలూరు (ఆర్ఆర్‌పేట) : వైఎంహెచ్ఏ హాలులో స్పటిక లింగానికి అభిషేకం చేస్తున్న దృశ్యం


బలివేలో జల్లు స్నానమాచరిస్తున్న భక్తులు


బలివేలో కిటకిటలాడిన భక్తులు


బలివేలో పూజ చేస్తున్న భక్తులు

వైభవంగా రామకోటి మహోత్సవాలు


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పైడి భీమేశ్వరరావు దంపతులు


కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న స్వర్ణలత శిష్య బృందం


పేరయ్య కోనేరు ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. 10.30 గంటల నుంచి పార్థివ లింగానికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వైఎస్సార్ సీపీ నాయకుడు పైడి భీమేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాడా రామారావు దంపతుల ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. రాత్రి నగరానికి చెందిన స్వర్ణ నృత్యాలయం ఆధ్వర్యంలో నాట్యాచారిణి కె.స్వర్ణలత శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా అలరించాయి.

యువతి అదృశ్యం

దెందులూరు : సీతంపేట గ్రామంలో యువతీ అదృశ్యమైనట్టు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. సుంకర శివ రామకృష్ణ సరోజిని కుమార్తె సాయి శ్రీలక్ష్మి ప్రైవేట్ జాబ్ చేసి ఇంటి వద్ద ఉంటుందన్నారు. ఈనెల 25న స్నేహితురాలు వద్దకు వెళ్లి తిరిగి రాలేదన్నా రు. జంగారెడ్డిగూడెంకు చెందిన అమర్ అనే యువకుడుపై తమకు అనుమానం ఉందని ఆమె తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	28	బీన్స చిక్కుడు	64
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	80
కాకర కాయలు	36	బీట్‌రూట్	30
బీరకాయలు (పందిరి)	46	కీరా దోస	40
కాలీఫ్లవర్	--	ఫ్రెంచ్‌బీన్స్	72
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	34	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20-28	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్ఈఎల్ స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్	22.30	15
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	18
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

సర్కారుపై యువత గుర్రు

- నిరుద్యోగ భృతి ఊసే లేదు
- మెగా డీఎస్సీ దగా డీఎస్సీ
- ఆప్కాస్ రద్దు యోచనతో ఉద్యోగుల్లో ఆందోళన


మెగా డీఎస్సీ కోసం ధర్నా చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): ఎన్నికల హామీలు అమలు చేయకుండా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తమను నమ్మించి మోసం చేసిందంటూ యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు అందిస్తామని లేని పక్షంలో నిరుద్యోగ భృతి అందజేస్తామంటూ డబ్బాలు కొట్టిన నాయకులు ప్రస్తుతం దాని ఊసే ఎత్తక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలకులు తమతో ఆటలాడుకోవడం తగదని, నేడు నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి తగిన గుణపాఠం చెబుతామంటూ నిరుద్యోగులు హెచ్చరిస్తున్నారు.

ఎదురుచూపులు

ఏలూరు నియోజకవర్గంలో ఉన్న సుమారు 3.50 లక్షల జనాభాలో 30 వేల మందికి పైగా నిరుద్యోగులు ఉన్నారు. వీరంతా ప్రభుత్వం తమకు ఉద్యోగాలు కల్పిస్తుందని, లేని పక్షంలో ప్రతి నెలా నిరుద్యోగ భృతి రూ.3 వేలు చొప్పున అందిస్తుందనే ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. ఈ హామీ అమలుకు కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై నిరుద్యోగులు గుర్రుగా ఉన్నారు. అవకాశం వస్తే తమ సత్తా ఏమిటో చూపేందుకు సన్నద్ధమవుతున్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ఆవేదన

మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామంటూ ఎన్నికల్లో కూటమి నాయకులు ఊకదంపుడు ప్రకటనలు గుప్పించారు. అధికారంలోకి రాగానే డీఎస్సీ అభ్యర్థుల కంటి నీరు తుడిచే విధంగా డీఎస్సీ ప్రకటన చేశారు. ఇది జరిగి తొమ్మిది నెలలు కావస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. పాలకులు మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులైన తమను మోసం చేసిందంటూ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల ఆగ్రహం

గత ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఆప్కాస్ విధానం రద్దు చేసే యోచనలో కూటమి ప్రభుత్వం ఉండటం పట్ల నియోజకవర్గంలో ఉన్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్ట్ ఏజెన్సీలు, సంస్థలు, వ్యక్తులు లేకుండా ఆప్కాస్ ద్వారా నేరుగా ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించడం, పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాలలో వాటాను జమ చేయడం వంటి వాటి వల్ల నియోజకవర్గంలోని సుమారు 1500 మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరింది. ఆప్కాస్ రద్దు చేసి మరలా పాత విధానాన్ని ప్రవేశ పెడితే తమకు కష్టాలు తప్పవంటూ వారు ఆందోళన చెందుతున్నారు.


గ్రంథాలయంలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న నిరుద్యోగులు

హామీని నిలబెట్టుకోవాలి



ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేస్తామని, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తామంటూ ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. తొలగించిన వలంటీర్లను విధుల్లోకి తీసుకుని వారికి నెలకు రూ.10 వేలు వేతనం అందించాలి.

– జి.సూర్యకిరణ్, జిల్లా కార్యదర్శి, డివైఎఫ్ఐ, ఏలూరు జిల్లా

సూపర్ సిక్స్ అమలులో విఫలం



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమైంది. ఇంట్లో చదువుకునే ప్రతి పిల్లవాడికీ రూ.15 వేలు, తల్లికి వందనం పేరుతో వేస్తామంటూ ఇచ్చిన హామీ ఏమైంది? నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడటం తగదు. తక్షణం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి.

– కె.లెనిన్, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ, ఏలూరు జిల్లా

రోడ్లే పశువులకు ఆవాసం

- ప్రయాణికులకు పాట్లు
- గణపవరంలో తరచూ ప్రమాదాలు

గణపవరం: పశువులకు రోడ్లు ఆవాసాలుగా మారాయి. ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో పశువులు రోజంతా రోడ్లపైనే తిష్ట వేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ ఒక్కోసారిగా వాటిలో అవే పోట్లాడుకుని బాటసారులు, వాహనచోదకులపైకి దూసుకురావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అవి రోడ్లపై పడకేయడంతో ట్రాఫిక్‌కు సమస్యలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపై పడకేసిన పశువులను గుర్తించేలోపే వాహనాలను వాటిని ఢీకొంటున్నాయి. పశువులతోపాటు వాహనచోదకులూ గాయాలపాలవుతున్నారు.

స్పందించని పశుపోషకులు

పశువులను రోడ్లపై వదిలితే చర్యలు తప్పవని, వాటిని గోశాలలకు తరలిస్తామని సంబంధిత అధికారులు హెచ్చరిస్తూ, నోటీసులు ఇస్తున్నా పశువుల యజమానుల్లో స్పందన ఉండటంలేదు. వారు ఉదయం, సాయంత్రం పశువుల నుంచి పాలు పితుక్కుని తర్వాత వాటిని రోడ్లపై వదిలేస్తున్నారు. వీటితో పాటు పాలివ్వని, వట్టిపోయిన, మగ పశువులను మేపడం దండగన్న ఉద్దేశంతో రోడ్లపై వదిలేస్తున్నారు. దీంతో ప్రజలు, బజారుకు వచ్చే మహిళలు ప్రాణాలను అరచేత పట్టుకుని రోడ్డుపై రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి పశువుల బారినుంచి ప్రజలను రక్షించాలని కోరుతున్నారు.

ప్రమాదాలు ఇలా..

రోడ్లపై విచ్చలవిడిగా పశువులు సంచరించడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో గణపవరం ఎస్సై హరికృష్ణ ఏలూరు నుంచి గణపవరం వస్తుండగా రాత్రి సమయంలో నిడమర్రు వద్ద రోడ్డు మలుపులో పడుకుని ఉన్న పశువులను గుర్తించేలోపు జీపు ఢీకొట్టింది. దీంతో జీపు తిరగబడి ఎస్సై హరికృష్ణ తీవ్రంగా గాయపడ్డారు.

- గణపవరం సెంటర్‌లో ఇటీవల రెండు ఆవులు పోట్లాడుకుంటూ మోటార్ సైక్లిస్ట్‌పై పడటంతో ఆ దంపతులు గాయపడ్డారు.


గణపవరంలో రోడ్డుపై సంచరిస్తున్న పశువులు

- గణపవరం బొబ్బిలి వంతెనపై పడుకున్న పశువును మోటార్ సైక్లిస్టు ఢీకొని కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు.
- బువ్వనపల్లిలో ఆబోతు రోడ్డుపై వెళ్తున్న మహిళలపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఉపాధి హామీ కూలీలు ఆబోతును అదిలించడంతో ఆమెకు గండం తప్పింది.
- టెలిఫోన్ ఎక్ఛేంజి వద్ద రోడ్డుపై పడుకున్న పశువుల గుంపుపైకి బైక్‌పై దూసుకెళ్లడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.
- పశువులపై వాహనాలు దూసుకెళ్లి చనిపోవడం, వాటికాళ్లు విరిగిన ఘటనలు అనేకం ఉన్నాయి.

రోడ్లపైనే తిష్ట

గణపవరం పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే రోడ్లపై పశువులు తిష్ట వేస్తున్నాయి. భీమవరం రోడ్డు, ఏలూరురోడ్డు, తాడేపల్లిగూడెం రోడ్లపై నిరంతరం పశువులు సంచరిస్తూనే ఉంటాయి. బస్టాండు, బొబ్బిలి వంతెన, శేష్ మహల్, కుమారి సెంటర్, మహాలక్ష్మి సెంటర్, బువ్వనపల్లి టెలిఫోన్ ఎక్ఛేంజి, సరిపల్లె సెంటర్ తదితర ప్రాంతాల్లో పశువుల సంచారం ఎక్కువగా ఉంది.

నోటీసులు ఇస్తున్నాం

గణపవరంలో రోడ్లపై తిరుగుతున్న పశువుల యజమానులను గుర్తించి వారికి నోటీసులు ఇస్తున్నాం. ఇప్పటికే కొంతమేర పశువులను రోడ్లపైకి వదలకుండా కట్టడిచేశాం. చాలా పశువులకు యజమానులు లేరు. పాలివ్వని, మగ, దానం ఇచ్చిన పశువులను రోడ్లపై వదిలేస్తున్నారు. వీటిని పట్టణానికి దూరంగా తరలించడానికి ప్రయత్నిస్తున్నాం.

– డి.శివరామ్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, గణపవరం